క్లుప్తంగా

సంపత్ వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెంలోని కోదండ సీతారామ, ధనలక్ష్మి దేవి, సంపత్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు శ్యామ్ ఆచార్యులు ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాతసేవ, విశేష పూజలు, పంచామృతా భిషేకాలు నిర్వహించారు. అనంతరం వేంకటేశ్వరస్వామి పద్మావతి, ఆలివేలు మంగమ్మకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీ దళబిల్వార్చన వంటి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

స్కేటింగ్ పోటీల్లో పవన్‌కు రజతం


పవన్ కార్తికేయను అభినందిస్తున్న బుల్లయ్య కళాశాల యాజమాన్యం

సీతంపేట: ఇటీవల చండీగఢ్ మొహాలిలో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ డిస్ట్రిక్ట్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభతో పతకాలు కైవసం చేసుకున్నారు. బీఎస్సీ ఫస్టియర్ విద్యార్థి సీహెచ్.వి.పవన్ కార్తికేయ ఇన్ లైన్ ఆల్‌పెన్ విభాగంలో రజత పతకం సాధించాడు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో పవన్‌ను బుల్లయ్య కాలేజీ సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్‌తో పాటు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.శ్రీకాంత్, అసిస్టెంట్ డీన్ మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి అభినందించారు.

భక్తులకు చీరల పంపిణీ


చీరలు అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు జనతా కాలనీలోని దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అతిథి వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అమ్మవారికి క్షీరాభిషేకం, కుంకుమార్చనలు చేశారు. అనంతరం కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో మహిళా భక్తులకు ఆయన చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

91, 92 వార్డుల్లో జెడ్సీ పర్యటన


ప్లాస్టిక్ సంచులు వాడరాదని దుకాణదారుడికి సూచిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

గోపాలపట్నం: జీవీఎంసీ 91, 92 వార్డుల్లోని ప్రశాంతినగర్, శ్రీరామ్‌నగర్ ప్రాంతాల్లో శనివారం జోన్–8 కమిషనర్ మల్లయ్యనాయుడు పర్యటించారు. గెడ్డల్లో పూడికల తీతలు చేపట్టాలని సిబ్బందికి ఆయన ఆదేశించారు. ప్లాస్టిక్ సంచులు వాడరాదని, వాటిని అమ్మినా, వినియోగించినా జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఇటీవల వర్షాలు పడిన సమయంలో శ్రీరామ్‌నగర్ గెడ్డలో పూడికలు తీసిన పారిశుధ్య కార్మికులను అభినందించారు. సచివాలయం కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పదిలో మెరిశారు

పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. అన్ని పాఠశాలల్లో మంచి ఫలితాలు రావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో బాణసంచా కాల్చుతున్న ఉపాధ్యాయులు

గోపాలపట్నం: పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఫలితాలు తెలిసిన అనంతరం బాణసంచా కాల్చి సందడి చేశారు. ఈ పాఠశాలలో రాయవరపు లక్ష్మి సత్య సాయి గౌతమి, గవర జాహ్నవి అత్యధిక మార్కులు సాధించారు. పాఠశాల నుంచి 275 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 181 మంది ఉత్తీర్ణులయ్యారు.

- గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో 247మంది పరీక్షలు రాయగా 127 మంది పాసయ్యారు. పాఠశాల నుంచి రాయబోని శ్రీనివాసరావు మంచి మార్కులు సాధించాడు.
- హెచ్‌సీ వెంకటాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో 61 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 42 మంది పాసయ్యారు.
- కొత్తపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో 41 పరీక్షలు రాయగా 33 మంది పాసయ్యారు.
- యల్లపువానిపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో 74 మంది పరీక్షలు రాయగా 51 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.
- మేహాద్రిగెడ్డ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 74 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 57 మంది ఉత్తీర్ణత సాధించారు.
- భాష్యం పాఠశాలలో 301 మందిలో 290 మంది ఉత్తీర్ణత సాధించారు. 119 మంది విద్యార్థులు 500 పైచిలుకు మార్కులు సాధించారు. విద్యార్థులను జోనల్ ఇన్‌చార్జి వెంకట్, ప్రిన్సిపాల్ కె. మణికంఠరెడ్డి అభినందించారు.
- రవీంద్రభారతి పాఠశాలలో 97 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 93 మంది పాసయ్యారు.

ఆర్పీ పేట హైస్కూల్‌కు 54.05 శాతం

కంచరపాలెం: రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ హైస్కూల్ 54.05 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. 143 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరు కాగా.. 77 మంది పాసయ్యారని, ఆరుగురు విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారని చెప్పారు.

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు గాంధీగ్రామం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో 58 మంది పరీక్షలు రాశారు. వీరిలో 44 మంది ఉత్తీర్ణత సాధించగా, 14 మంది ఫెయిలయ్యారు. అయితే ఉత్తీర్ణత సాధించిన వారిలో 20 మంది 500 పైగా మార్కులు సాధించడం విశేషం.

దటీజ్ మల్కాపురం

మల్కాపురం: దటీజ్ మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల అని మరో సారి నిరూపించారు పాఠశాల విద్యార్థులు. ఇక్కడ విద్యార్థులు కరోనా ముందు వరుసగా మూడేళ్ల మంచి ఫలితాలు సాధించారు. 2022, 23 సంవత్సరంలో కూడా మంచి ఫలితాలు సాధించి పాఠశాల ఖ్యాతిని ఇనుమడింపజేశారు. పాఠశాల నుంచి 276 మంది పదో తరగతి పరీక్షలు రాశారు. 209 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 500 పైగా మార్కులు సాధించిన వారు 64 మంది ఉన్నారు.

- జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల నుంచి 122 మంది పరీక్షలు రాశారు. 84 మంది ఉత్తీర్ణులయ్యారు. పాస్ అయిన వారిలో 500 పైగా మార్కులు సాధించిన వారు 12 మంది ఉన్నారు. శ్రీహరిపురం భాష్యం పాఠశాలలో 30 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. జీవీఎంసీ పాఠశాలల్లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించి, స్వీట్లు తినిపించారు.

ఐఐటీలో ఇంజినీరింగ్ చేస్తాను



నేను బాగా చదవడానికి ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు రుణపడి ఉంటాను. భవిష్యత్తులో బాగా చదువుకుని ఐఐటీలో ఇంజినీరింగ్ చేయాలని ఉంది.

– సాయిగౌతమి, గోపాలపట్నం బాలికల జెడ్పీ హైస్కూల్

ఉపాధ్యాయులు ప్రోత్సహించారు



మా తల్లిదండ్రులతో పాటు నన్ను ఉపాధ్యాయులు ఎంతో ప్రోత్సహించారు. వారి సహకారమే లేకుంటే ఇన్ని మార్కులు సాధించేదాన్ని కాదు. భవిష్యత్తులో బాగా చదువుకుని ఇంజినీర్‌గా స్థిరపడాలనేది నా కోరిక.

–గవరజాహ్నవి, గోపాలపట్నం బాలికల జెడ్పీహైస్కూల్

మెకానికల్ ఇంజినీర్‌ని కావాలని..



మా టీచర్లు ఎంతో ప్రోత్సాహం అందించారు. రోజూ ప్రత్యేక తరగతులకు హాజరై, బాగా ప్రిపేర్ అయ్యాను. ఇంజినీర్ అవుతాను. తల్లిదండ్రులకు పేరు తెస్తాను

–హర్షిత, మల్కాపురం పాఠశాల

బీజేపీ పాలనలో కార్మిక చట్టాలు నిర్వీర్యం

- అఖిల భారత సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్
- ఉక్కు రిలే దీక్షకు సంఘీభావం


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: శ్రామికుల కష్టనష్టాలను పట్టించుకోకుండా కార్పొరేట్ కంపెనీల యజమానులకు కొమ్ము కాస్తూ, బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తోందని అఖిల భారత సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ విమర్శించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 814వ రోజు శనివారం కోక్‌ఓవెన్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తపన్‌సేన్ మాట్లాడుతూ విభజన హామీలను విస్మరించి రాష్ట్రాన్ని అన్ని విధాల నష్టాల్లోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలన్నారు. ప్రైవేట్ కంపెనీలు అప్పులు చేసి తిరిగి కట్టకుండా ఎగ్గొడితే వాటిని రుణమాఫీ పేరుతో మాఫీ చేస్తున్నారని విమర్శించారు. ప్రాణత్యాగాలతో ఏర్పడిన విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం కానివ్వబోమన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించేలా ప్రజలను చైతన్యం చేసే విధంగా కార్మికులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ డీజీఎంకు ఏయూ డాక్టరేట్


ఉత్తర్వులు స్వీకరిస్తున్న చిట్టోడు

ఏయూక్యాంపస్: విశాఖ డెయిరీ డీజీఎం (ట్రైనింగ్) ఉగ్గిన చిట్టోడుకి ఆంధ్రవిశ్వవిద్యాలయం డాక్టరేట్ లభించింది. న్యాయ కళాశాల ఆచార్యులు డి.సూర్య ప్రకాశ రావు పర్యవేక్షణ లో 'రైట్ టు వర్క్ అండ్ వర్కర్స్ రైట్స్ విత్ రిఫరెన్స్ టు లేబర్ కోడ్స్ 2020– ఏ సోషియో లీగల్ స్టడీ' అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి నుంచి శుక్రవారం డాక్టరేట్ ఉత్తర్వులను చిట్టోడు స్వీకరించారు. కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్.. చిట్టోడుని అభినందించారు. విశాఖ డెయిరీ పూర్వ చైర్మన్ ఆడారి తులసీరావు స్ఫూర్తితో తాను పీహెచ్‌డీ చేశానని చిట్టోడు తెలిపారు.

విద్యార్థినికి ఏయూ వీసీ అభినందన


హర్షితను అభినందిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: జాతీయ స్థాయిలో భారత ప్రభుత్వం, లోక్‌సభ సెక్రటేరియట్, విద్య,యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ ఈ నెల 9వ తేదీన పార్లమెంట్ హాల్‌లో నిర్వహించే గురు రవీంద్రనాథ్ ఠాగూర్ 162వ జయంతి వేడుకల్లో ఆంధ్రవిశ్వవిద్యాలయం న్యాయ కళాశాల విద్యార్థిని హర్షిత దేవగుప్తాపు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా హర్షితను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. దేశ వ్యాప్తంగా 25 ప్రభుత్వ విద్యాలయాల నుంచి 25 మంది విద్యార్థులను ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించడానికి ఎంపిక చేశారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొని రవీంద్రనాథ్ ఠాగూర్‌పై హర్షిత ప్రసంగిస్తారు. ఇటువంటి ప్రతిష్టాత్మక కార్యక్రమంలో ఏయూ విద్యార్థిని భాగం కావడంపై వీసీ ప్రసాద రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, డాక్టర్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌జీ పాలిమర్స్ ప్రమాద మృతులకు నివాళి


నివాళులర్పిస్తున్న సీఐటీయూ నేతలు

మద్దిలపాలెం : మూడేళ్ల కిందట ఎల్‌జీ పాలిమర్స్ దుర్ఘటనలో మృతులకు సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నివాళులర్పించింది. ప్రమాద స్థూపం నమూనాను ఏర్పాటు చేసి కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కే ఎస్వీ కుమార్ మాట్లాడుతూ ఈ దుర్ఘటన ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలకు తక్షణం నష్టపరిహారం అందజేయడం శుభపరిణామన్నారు. అయితే గాయపడిన కొందరికి నష్ట పరిహారం అందలేదన్నారు. తక్షణమే బాధిత కుంటుంబాలను ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఆఫీసు బేరర్ ఎస్.జ్యోతీశ్వరరావు, పి.మణి, కె.ఎం.కుమారమంగళం, జిల్లా కమిటీ సభ్యులు అప్పలరాజు, నూకరాజు, వెంకటరావు, కుమారి పాల్గొన్నారు.

మంచినీటి పథకం మరమ్మతులకు చర్యలు


మంచినీటి ట్యాంకు పెచ్చులు ఊడిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

సాక్షి ఎఫెక్ట్..

మల్కాపురం: భారీ మంచినీటి పథకం మరమ్మతులకు చర్యలు చేపడతామని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ చెప్పారు. జీవీఎంసీ 59వ వార్డు పరిధి పాతచెక్‌పోస్టు ఏరియాలో ఉన్న భారీ మంచినీటి పథకం ప్రమాదకరంగా ఉందని సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. అధికారులతో కలిసి మంచినీటి పథకాన్ని ఆనంద్‌కుమార్ పరిశీలించారు. మరమ్మతులకు ఎంత అవుతుందో అంచనా విలువ తెలుసుకున్నారు.వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడారు. యుద్ధప్రాతిపదిక మరమ్మతులు చేపట్టాలని ఆనంద్‌కుమార్ సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ అప్పారావు

గోపాలపట్నం: ఎన్ఏడీ జంక్షన్ ఫ్లైఓవర్ దిగువ సర్కిల్‌లో ఆటో డ్రైవర్లకు కంచరపాలెం సీఐ మళ్ల అప్పారావు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని తెలిపారు. డ్రైవర్లు బ్యాడ్జి ధరించాలని , లైసెన్స్ ఉన్నవారు మాత్రమే డ్రైవింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రావ్యంగా గాత్ర కచేరి



అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తున్న లక్ష్మీ సూర్యతేజ

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం అన్నమయ్య కీర్తనల గాత్ర కచేరి శ్రావ్యంగా సాగింది. నగరానికి చెందిన ప్రముఖ గాత్ర విద్వాంసురాలు ఎ.లక్ష్మీ సూర్య తేజ అన్నమయ్య కీర్తలను ఆలపించి అలరించారు. కచేరికి ఎస్.పార్థవి వయోలిన్, ఎస్.సుబ్రహ్మణ్యం మృదంగం సహకారం అందించారు. కార్యక్రమాన్ని నేదునూరి శ్రీవల్లీ, ఎం.ఎస్.శ్రీనివాస్, చంద్రశేఖర్ ప్రారంభించారు.

రేపటి భవిష్యత్తు మన జగనన్నే..

వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి


ఇందిరానగర్‌లో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఆనంద్‌కుమార్

గోపాలపట్నం: రేపటి భవిష్యత్తు కోసం కష్టపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో శుక్రవారం జీవీఎంసీ 92, 91 వార్డు ఇందిరానగర్, లక్ష్మీనగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా ఏవిధమైన లబ్ధి పొందారో విశదీకరించారు. ఇదే విధంగా అందరికీ మేలు చేకూరాలంటే మనం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలు 98 శాతం నెరవేర్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ప్రతీ పేదవానికి అండగా నిలిచిన ప్రభుత్వమని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, ఊటపల్లి గోవిందు, కస్వినర్ల త్రినాథ్, అనురాధ, కిషోర్, రామకృష్ణ, దాసరి శ్రీను, జీవీ రమణ, శివాజీ, కంపర సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల రక్షణ చట్టంపై శిక్షణ తరగతులు


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వినియోగదారుల సంఘ చైర్మన్ సత్యనారాయణ

కంచరపాలెం: ఐటీఐ జంక్షన్‌లోని జిల్లా వినియోగదారుల సంఘం సమైక్య కార్యాలయంలో సంఘ చైర్మన్ మర్రి సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం వినియోగదారుల రక్షణ చట్టంపై ఇంటర్న్‌షిప్ శిక్షణ తరగతులు నిర్వహించారు. జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ సమాజంలో వినియోగదారులు ఎలా మోసపోతున్నారో తెలుసుకోడానికి కొన్ని సంస్థలను ఎంపిక చేసి సర్వే రిపోర్ట్ ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. కోర్టు అంటే భయపడేవారు, చదువురాని వారికి వినియోగదారుల సంఘం ఎంతగానో సేవలందిస్తుందని చెప్పారు. విద్యార్థి దశ నుంచే వినియోగదారుల రక్షణ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు ప్రత్యేక క్యాంపస్ డ్రైవ్


పరీక్ష రాస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో కేంద్రీకృత ప్రాంగణ ఉద్యోగ నియామకాలకు శనివారం ప్రత్యేక క్యాంపస్ డ్రైవ్ జరిగింది. ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ సి.నాగరాణి ఆదేశాల మేరకు మేధా సర్వో డ్రైవ్స్ ప్రైవేట్ లిమిటెడ్(హైదరాబాద్) విద్యార్థులకు రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించింది. విశాఖపట్నం, భీమునిపట్నం, పెందుర్తి, చోడవరం, అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 305 మంది విద్యార్థులు హాజరయ్యారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ నుంచి 44 మంది మెకానికల్, 33 మంది ఎలక్ట్రికల్, భీమునిపట్నం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ నుంచి 22 మంది ఎలక్ట్రానిక్, పెందుర్తి నుంచి 20 మంది మెకానికల్, 29 మంది ఎలక్ట్రికల్, 28 మంది ఎలక్ట్రానిక్స్, చోడవరం నుంచి 47 మంది ఈసీఈ, నర్సీపట్నం నుంచి 30 మెకానికల్, 9 ఈసీఈ, పాడేరు ప్రభుత్వ ఆదర్శ ఆశ్రమ పాలిటెక్నిక్ నుంచి 11 మెకానికల్, ముగ్గురు ఎలక్ట్రికల్ విద్యార్థులు పరీక్ష రాశారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.డి.వి.నరసింహారావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.హరిబాబు పర్యవేక్షించారు.

పూర్వవిద్యార్థుల సమావేశం


పూర్వవిద్యార్థిని సత్కరిస్తున్న దృశ్యం

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ ఐఐఏఎంలో శనివారం జేఎన్‌టీయూ కాకినాడ వైజాగ్ చాప్టర్ పూర్వవిద్యార్థుల సమావేశం జరిగింది. శనివారం సమావేశమైన విద్యార్థులు అలనాటి జ్ఞాపకాలను గుర్తుకుతెచ్చుకుని ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి రామ్మోహనరావు మాట్లాడుతూ జేఎన్‌టీయూ కాకినాడలో చదవడం ద్వారా తమ బ్యాచ్ విద్యార్థులంతా పూర్తిస్థాయిలో ఉన్నత ఉద్యోగాలు సాధించారన్నారు. తమ బ్యాచ్‌తో పాటు ఇతర బ్యాచ్‌లలో జేఎన్‌టీయూ కాకినాడలో చదివిన విద్యార్థులలో విశాఖలో ఉన్నవారితో ఏటా సమావేశమై తమ భావాలను పంచుకోవడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా శనివారం సమావేశమైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉన్నత స్థాయిలో ఉన్న పలువురిని సత్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రీప్రసాద్, వెంకటరమణ, ఏపీఎస్ఆర్‌టీసీ విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు పాటించాలి


ప్లకార్డులను ప్రదర్శిస్తున్న ఉద్యోగులు

బీచ్‌రోడ్డు: ప్రతి ఒక్కరు ఇంధన వినియోగం తగ్గించుకొని భవిష్యత్తు తరాలకు కొరత లేకుండా చూడాలని గెయిల్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ ఎల్ఎస్ రావు పిలుపునిచ్చారు. సాక్షమ్ వాకథాన్ పేరుతో ఇంధన పొదుపుపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం ఆర్కేబీచ్‌లో నిర్వహించారు. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ వాక్‌థాన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎల్ఎస్‌రావు మాట్లాడుతూ ఇంధన వినియోగం తగ్గించుకునేందుకు నడక, సైక్లింగ్, ప్రజా రవాణా వినియోగించాలన్నారు. భారతదేశం అత్యధికంగా ఇంధనాన్ని దిగుమతి చేసుకోవడం జరుగుతుందన్నారు. కాబట్టి ఇంధన వినియోగం తగ్గించి దేశ ఆర్థిక వ్యవస్థకు అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలువుర్ని సత్కరించారు. వాక్‌థాన్‌లో పెద్ద సంఖ్యలో యువతీ యువకులు పాల్గొన్నారు.

చమురు దిగుమతులను తగ్గించాలి

బీచ్‌రోడ్డు: ముడి చమురు దిగుమతులపై మన దేశం ఆధారపడడాన్ని తగ్గించాలంటే ఇంధన పొదుపు చాలా అవసరమని హెచ్‌పీసీఎల్ డీజీఎం (సేల్స్) మురళీకృష్ణ అన్నారు. సాక్షమ్ పేరుతో హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో శనివారం బీచ్‌రోడ్డులో అవగాహన ర్యాలీను నిర్వహించారు. ఈ ర్యాలీను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ మన దేశంలోని ప్రజల ఆరోగ్యం, పర్యావరణం, ఇంధన పొదుపుపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సుందర వదన్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.